క్లుప్తంగా

వివేకానంద విగ్రహ ఏర్పాటుకు సహకరించాలి

డోన్ టౌన్: ప్రపంచానికి భారతదేశ చరిత్ర, సంస్కృతి గొప్పతనాన్ని చాటిన స్వామి వివేకానంద విగ్రహం ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డోన్ వివేకానంద సేవా సమితి వ్యవస్థాపకుడు మలిశెట్టి జగన్మోహన్ కోరారు. సమితి గౌరవ అధ్యక్షుడు సప్తశైల తిమ్మయ్య ఇంటి ఆవరణలో మంగళవారం సమితి సభ్యుల సమావేశం నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన కూడలిలో విగ్రహ ఏర్పాటుకు సభ్యులు తీర్మానం చేశారు. విగ్రహ ఏర్పాటు విషయాన్ని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సహకారం కోరుతామని ఈ సందర్భంగా మలిశెట్టి జగన్మోహన్ తెలిపారు.

పదవీ విరమణ తప్పనిసరి

బేతంచెర్ల: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ, పదవీ విరమణ తప్పదని విద్యుత్ డీఈఈ మధు సూధన్ రెడ్డి, టౌన్, రూరల్ ఏఈలు శ్రీనివాసులు, మహబూబ్ వలీ అన్నారు. పదవీ విరమణ పొందిన రంగాపురం లైన్‌ఇన్‌స్పెక్టర్ నాగరాజు మంగళవారం డోన్ రహదారిలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఆయనకు డీఈఈ, ఏఈలు, సిబ్బంది శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. నాగరాజు సేవలను ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు.

కబడ్డీ విజేత మిద్దెపల్లె జట్టు



మిద్దెపల్లె జట్టుకు నగదు అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ ఎస్ రంగాపురంలో వెలసిన హజరత్ సయ్యద్ షా అల్లబకాష్ దర్గా ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకొని రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. హోరా హోరీగా సాగిన పోరులో డోన్ మండలం మిద్దె పల్లె జట్టు ప్రథమ స్థానం కై వసం చేసుకోగా, ద్వితీయ, తృతీయ స్థానాల్లో బేతంచెర్ల మండలం, ఓర్వకల్లు మండలం శకునాల జట్లు నిలిచాయి. విజేతలకు దాతల సహకారంతో రూ. 30 వేలు, రూ.20 వేలు, 10 వేలు చొప్పున అందజేశారు.

9 నుంచి టెక్కెస్వామి ఉరుసు

అవుకు: మండల పరిధిలోని అవుకు రిజర్వాయర్ సమీపాన కొండల్లో వెలసిన హజరత్ అపాంషావలి బాబా టెక్కెస్వామి ఉరుసు మహోత్సవాలు ఈనెల(ఫిబ్రవరి)9నుంచి ప్రారంభమవుతాయని దర్గా కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. 9వ తేదీ రాత్రి 3 గంటలకు కునుకుంట్ల గ్రామ పెద్దలు గూడాల శివరామిరెడ్డి, గూడాల మురళీధర్ రెడ్డి, గూడాల ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో హిందూ, ముస్లిం పెద్దలతో కలిసి పీఠం నుంచి మేళతాళలతో, పక్కీరుల జల్సాలతో వైభవంగా గంధోత్సవం నిర్వహిస్తామన్నారు. అదేరోజు రాత్రి మైదరాబాద్ షాఫియావారి ఖవాలీ కార్యక్రమం ఉంటుందన్నారు. 10వ తేదీన ఉరుసు మహోత్సవం ఉంటుందని, భక్తాదులకు కునుకుంట్ల గ్రామపెద్దలు, భక్తులు సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. 11వ తేదీన జియారత్ కార్యక్రమం ఉంటుందని దర్గా కమిటీ సభ్యులు తెలిపారు.

చెరువుకు హెచ్‌ఎన్ఎన్ఎస్ ద్వారా ట్రయల్‌రన్



ట్రయల్ రన్ నిర్వహిస్తున్న దృశ్యం

ప్యాపిలి: చెరువులకు నీటిని నింపే కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పనులు శరవేగంగా సాగుతున్నాయి. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ మేరకు ప్యాపిలి సమీపంలోని కొత్త చెరువుకు మంగళవారం ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయల సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, సచివాలయాల జేఏసీ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి తదితరులు మాట్లాడారు. వచ్చే ఖరీఫ్ నాటికి మండలంలోని అన్ని చెరువులకు నీటిని నింపే కార్యక్రమం పూర్తవుతుందన్నారు. తద్వారా రైతులకు వ్యవసాయానికి సాగునీటికి ఢోకా ఉండదన్నారు. భూగర్భ జలాలు సైతం అభివృద్ధి చెందడంతో బోర్లలోనూ సమృద్ధిగా నీరు ఉంటుందన్నారు.

జగనన్న కాలనీకి విద్యుత్ సౌకర్యం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని తుమ్మల పెంట సమీపంలోని జగనన్న కాలనీకి అధికారులు విద్యుత్ సౌకర్యం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. విద్యుత్ స్తంభాలు అమర్చి, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాలనీలో 133 మంది లబ్ధిదారులకు గృహాలు మంజూరు అయ్యాయి. ఇళ్ల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే లే అవట్‌లో రెండు బోర్లు వేశారు. నిర్మాణాలు వేగవంతం కావడంతో లబ్ధిదారులకు నీటి సమస్య లేకుండా చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇళ్ల నిర్మాణాలకు కంటే ముందుగానే ప్రభుత్వం విశాలమైన రోడ్లు, విద్యుత్, నీటి సౌకర్యం కల్పిస్తుండటంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు

- అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు
- సంక్షేమ సారథి సీఎం జగనన్న
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల: ప్రజల చల్లని దీవెనలతో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నవరత్నాలు పథకాల అమలుతో పేదల జీవితాల్లో వెలుగులు నింపిందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి పథకాలు వర్తింపచేస్తున్న సీఎం వైఎస్ జగనన్న సంక్షేమ సారథి అని, ఆయన పాలనలో ప్రజలంతా సుభిక్షంగా ఉన్నారని పేర్కొన్నారు. కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలోని ఒకటవ గ్రామ సచివాలయ పరిధిలో రెండవ రోజు మంగళవారం 'గడప గడపకు మనప్రభుత్వం' కార్యక్రమం సాగింది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, సీనియర్ నాయకులు అమడాల శంకరయ్య, ఎల్‌ఐసీ రామసుబ్బారెడ్డి, చిక్కేపల్లి రామకృష్ణారెడ్డి, ప్రసాదరెడ్డి, శ్రీనివాసనాయక్ తదితరులతో కలిసి ఎమ్మెల్యే కాటసాని 380 కుటుంబాలను సందర్శించారు. కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యేకు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. గడప గడపకు వెళ్లి మూడున్నరేళ్ల కాలంలో ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ పథకాల వివరాలను తెలియజేయడంతోపాటు సమస్యలపై ఆరా తీశారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. గాంధీనగర్‌లో సీసీరోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. యుద్ధప్రాతిపదికలన వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కాటసాని ఆదేశించారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుస్తోందని ఎమ్మెల్యే కాటసాని తెలిపారు. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. సంక్షేమంతోపాటు కోట్లాది రూపాయాలు వెచ్చించి చేస్తున్న అభివృద్ధి ప్రతిపక్ష టీడీపీ నాయకులకు కనబడటం లేదా అని ధ్వజమెత్తారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసాకేంద్రాలు, హెల్త్‌క్లినిక్‌లు, తదితర ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మించిందన్నారు. నాడు- నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ సెంటర్లను అన్ని హంగులతో కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలకు దీటుగా వసతులు కల్పించిందన్నారు. కేవలం మూడున్నరేళ్లలో గ్రామాలు అన్ని విధాలా అభివృద్ధి చెందాయని, టీడీపీ నాయకులకు కళ్లు బైర్లు కమ్ముకుని అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. గత ఐదేళ్ల టీడీపీ పాలన అవినీతి మయమని, జన్మభూమి కమిటీల పేరుతో ఆ పార్టీ నాయకులు దోచుకోవడం, దాచుకోవడమే లక్ష్యంగా పనిచేశారని ఆరోపించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎల్వీ సుధాకర్‌రెడ్డి, లోకేశ్వరరెడ్డి, బాలమద్దిలేటి, ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, తహసీల్దార్ పుష్పకుమారి, మండల వ్యవసాయాధికారి నిరంజన్, ఆర్‌డబ్ల్యూఎస్, ట్రాన్స్‌కో ఏఈలు హరీష్, రామసుబ్రహ్మణ్యం, వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం గురుస్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీతాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు గువ్వల రామకృష్ణారెడ్డి, గుద్దేటి చంద్రశేఖర్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, బూస భాస్కర్‌రెడ్డి, నరసింహారెడ్డి, గజ్జెలరెడ్డి, సహదేవరెడ్డి, చిన్నబాబు, రమేష్, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రామలలిత కుటుంబానికి... ఏకంగా రూ. 7.06 లక్షలు



రామలలితకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గడిచిన మూడున్నరేళ్ల కాలంలో పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన రామలలిత కుటుంబానికి ఏకంగా రూ. 7.06 లక్షల మేర లబ్ధి చేకూరింది. వైఎస్సార్ పింఛన్ కానుక, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన, వైఎస్సార్ సున్నవడ్డీ(డ్వాక్రా), అమ్మఒడి, ఇంటిస్థలం, పక్కాగృహం తదితర పథకాలు వర్తించాయని ఆ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఒక్క కుటుంబానికే కాకుండా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి 32 సంక్షేమ పథకాల ద్వారా రూ. 2 లక్షల నుంచి రూ. 4 లక్షల మేర లబ్ధి చేకూరడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బీసీ జనార్దన్‌రెడ్డికి గిరిజనుల సత్తా చూపుతాం



మాట్లాడుతున్న రాజునాయక్

నంద్యాల(అర్బన్): టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి బనగానపల్లె ఎస్ఐ శంకర్‌నాయక్‌పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, తీరు మార్చుకోకపోతే తమ సత్తా చూపుతామని జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ హెచ్చరించారు. దస్తగిరి అనే యువకుడి మృతి కేసులో ఎలాంటి ఆధారాలు చూపకుండా గిరిజన ఎస్ఐను సస్పెండ్ చేయడం సరికాదన్నారు. స్థానిక జీపీఎస్ కార్యాలయంలో మంగళవారం గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో విచారణ జరపకుండానే టీడీపీ నాయకుల ఆరోపణలతో ఎస్ఐపై వేటు వేయడం జిల్లా అధికారులకు తగదన్నారు. దీని వెనుక దాగి ఉన్న కుట్రను వెలికితీయాలని డిమాండ్ చేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యే బీసీపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో జీపీఎస్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు బాలునాయక్, వెలుగోడు వైస్ ఎంపీపీ శంకర్‌నాయక్, రవీంద్రనాయక్, సంజీవనగర్ తండా సర్పంచ్ శివశంకర్ నాయక్, ఎంపీటీసీ వెంకటేష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



కూలీల హాజరును పరిశీలిస్తున్న ఏపీడీ

కోవెలకుంట్ల: వ్యవసాయ పనులు ముగుస్తున్న నేపథ్యంలో మహాత్మగాంధీ జాతీయ ఉపాధి పథకం కింద పనులు కల్పించి కూలీల సంఖ్యను పెంచాలని ఏపీడీ సాంబశివరావు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండలంలోని వల్లంపాడు గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన తనిఖీ చేశారు. కూలీల హాజరు వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకం కింద ప్రతి కుటుంబానికి పనులు చూపించాల్సిన బాధ్యత ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీవిద్య, టెక్నికల్ అసిస్టెంట్ కొండయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్బయ్య పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని

బేతంచెర్ల: ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ శేషన్న తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ఎం.పెండేకల్లులో గ్రామంలో జరగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ పనులు పూర్తవుతున్నందున కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమయపాలన పాటించి రోజుకు రూ.257 వేతనం అందేలా పనిచేయాలన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



లబ్ధిదారులకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి

డోన్ రూరల్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కుల,మతాలు, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తూ పేదలకు న్యాయం చేస్తుందని మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని తిరునాంపల్లి, కొత్తబురుజు గ్రామాలలో మంగళవారం ఎంపీపీ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, నాయకులతో కలిసి గ్రామాల్లో విస్తృతంగా పర్యటించిన వారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం మూడున్నరేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. అదేవిధంగా ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి చేకూరిన వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి శ్రీరాములు, రేగటి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడారు. మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చారని గుర్తు చేశారు. అర్హత ఉండి కూడా ప్రభుత్వ పథకాలు అందని వారు ఉంటే తెలుపాలని, అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం వైఎస్ జగనన్న విద్యా, వైద్య, వ్యవసాయ రంగాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. నాడు- నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారని, పిల్లలను బడికి పంపే ఏ తల్లి ఆర్థిక ఇబ్బంది పడకూడదని అమ్మ ఒడి, విద్యా, వసతి దీవెన తదితర పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మారుమూల పల్లెలకు వైద్య సేవలను విస్తరింపజేశారని, విత్తనం నుంచి దిగుబడుల కొనుగోల వరకు రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని వివరించారు. పేదలకు మంచి జరుగుతుంటే ఓర్వలేని స్వార్థ నాయకులు విమర్శలు చేస్తున్నారని, వీరి అసత్యారోపణలను తిప్పికొట్లాలని వారు ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రామచంద్రుడు, తిరునాంపల్లి గ్రామ వైఎస్సార్ నాయకులు తిరుమల్‌రెడ్డి, గిడ్డారెడ్డి, కృష్ణారెడ్డి, కొత్తబురుజు నాయకులు తిమ్మయ్య, నాయుడు, రంగనాథ్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, సెంచు శ్రీరాములు, ఎంపీటీసీ సభ్యుడు చిన్ననారాయణ, ఎంపీడీఓ శ్రీనివాసులు. ఈఓఆర్డీ వరప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



హౌసింగ్ ఏఈలతో సమావేశమైన పీడీ శేషుబాబు

బేతంచెర్ల: నవరాత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో మంజూరైన గృహాలను లబ్ధిదారులు వేగవంతం చేయాలని, ఉగాది నాటికి పూర్తయేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా హౌసింగ్ పీడీ శేషుబాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని హౌసింగ్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. డోన్, బేతంచెర్ల, ప్యాపిలి మండలాల్లో జరుగుతున్న ఇంటి నిర్మాణాల పురోగతిపై ఏఈలు నాగభూషణం, కృష్ణారెడ్డిలతో చర్చించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పీఎంజీవై పథకం కింద 13,025 గృహాలు మంజూరయ్యాయన్నారు. ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం అందజేస్తున్న సహకారాన్ని లబ్ధిదారులకు వివరించి చైతన్య పరచాలని అధికారులు పీడీ సూచించారు. బిల్లులు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని ఏఈలు పీడీ దృష్టికి తీసుకెళ్లారు. ఇంటి నిర్మాణాలు చేపట్టిన వారికి బిల్లులు పెండింగ్ లేవన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యం



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి

డోన్ రూరల్ : తాగునీటి సమస్య పరిష్కారమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొచ్చెర్వు గ్రామంలో మంగళవారం ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ మంజుల భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాలలోని ప్రజలకు నీటి సమస్య లేకుండా చర్యలు చేపడుతున్నామని, సమస్యాత్మక గ్రామాలలో రూ.23లక్షలతో 40వేల లీటర్ల సామర్థ్యంతో ట్యాంక్ నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రామచంద్రుడు, జెడ్పీటీసీ సభ్యుడు రాజ్‌కుమార్ యాదవ్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూ ఏఈ సతీస్, ఉప సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మీనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు రమణయ్యశెట్టి, కృష్ణారెడ్డి, మహేశ్వర రెడ్డి, గంగాధర్‌రెడ్డి, కేపీ రాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



వైఎస్సార్ హెల్త్ సెంటర్ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

బేతంచెర్ల: గ్రామాల అభివృద్ధితో పాటు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ముద్దవరం గ్రామంలో రూ.17.50 లక్షలతో నిర్మిస్తున్న వైఎస్సార్ హెల్త్ సెంటర్ భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం స్లాబ్ లెవర్ వరకు నిర్మాణ పనులు పూర్తికాగ పైన విద్యుత్ తీగలు ఉండటంతో పనులకు అంతరాయం ఏర్పడుతుందని ఇంజనీర్ ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లగా విద్యుత్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తీగలు తొలగించాలని సూచించారు. అలాగే బేతంచెర్ల- వెల్దుర్తి డబుల్ రహదారి నిర్మాణ పనుల్లో కొలుములపల్లె గ్రామంలో తాగునీటి పైపులెన్లు దెబ్బతిన్నాయి. గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తడంతో ఎంపీపీ చొరవ తీసుకొని తాగునీటి ట్యాంకర్ల ద్వారా గ్రామస్తులకు తాగునీటిని అందిస్తున్నారు. కార్యక్రమంలో ఈఓ ఆర్డీ వెంకట రంగనాయకులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ రాజశేఖర్ రెడ్డి, ముద్దవరం సర్పంచ్ తిమ్మయ్య, గ్రామ నాయకులు కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఇలా... ఎలా !



పిల్లర్లకు మొక్కలు ఉన్న దృశ్యం

డోన్ టౌన్: ప్రకృతిలో కొన్ని మానవ ప్రమేయం లేకుండానే జరుగుతూ ఉంటాయి. రైతులు, ప్రజలు మొక్కలు నాటి నీరు పోసి పెంచుతున్నా సరిగా వృద్ధి చెందని పరిస్థితి. అయితే ఆశ్చర్యం కలిగించే విధంగా పట్టణంలో ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి పిల్లర్లకు రాగి మొక్కలు మొలకెత్తి చెట్లుగా పెరుగుతున్నాయి. అసలు పిల్లరు మీద ఉండే కాంక్రీటు బుడ్డుకు బెడ్డు మధ్య ఉన్న కొద్దిపాటు సందులో రాగి మొక్కలు మొలకెత్తడం అందరిని ఒకింత ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ఇలా.. ఎలా మొలుస్తాయని చూపరులు ప్రశ్నిస్తున్నారు. అయితే ఈ మొక్కలు పెద్దగా పెరిగితే బ్రిడ్జి నాణ్యతకు ప్రమాదకరంగా మారే పరిస్థితులు ఉన్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించిన బ్రిడ్జి నాణ్యత దెబ్బతినకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ప్యాపిలి: మండల పరిధిలోని రాచర్ల గ్రామం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు కరాటే పోటీల్లో ప్రతిభ చాటారు. ఈ నెల 29వ తేదీన కర్నూలులో జరిగిన మొదటి ఇంటర్ స్టేట్ కరాటే చాంపియన్‌షిప్‌లో తమ విద్యార్థులు పాల్గొన్నట్లు హెచ్‌ఎం తొగట సురేష్‌బాబు తెలిపారు. రెండు విభాగంలో విద్యార్థి వెంకట్ సునీల్ మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలిచారన్నారు. అదేవిధంగా మరో విభాగంలో విద్యార్థులు శివశంకర్, గోవర్ధన్ ద్వితీయ స్థానంలో నిలిచారని వివరించారు. ఈ మేరకు మంగళవారం ప్రతిభచాటిన విద్యార్థులతోపాటు కరాటే మాస్టర్ సుమంత్‌ను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సునీల్, ప్రేమ్ కుమార్, గోపాల్, వెంకట శేషయ్య, లక్ష్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కోవెలకుంట్ల: జాతీయస్థాయి యంగ్‌మూడో పోటీల్లో స్థానిక సెయింట్ జోసెఫ్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. గతనెల 27, 28, 29 తేదీల్లో మహారాష్ట్రలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన 550 మంది విద్యార్థులు పాల్గొన్నారని హెచ్‌ఎం లలిత తెలిపారు. కోవెలకుంట్లకు చెందిన నలుగురు విద్యార్థులు పోటీల్లో సత్తా చాటారన్నారు. హర్షిత్ వెండిపతకం, నవాజ్, కుందన, చరన్‌తేజ్‌లు కాంస్య పతకాలు సాధించారన్నారు. ఈ మేరకు మంగళవారం హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

న్యాక్ ఇ-మెయిల్‌కు స్పందించండి

డోన్ టౌన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం నాక్ గుర్తింపు సాధించడంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని యూనివర్శిటీ అభ్యాసకుల సహాయ కేంద్రం డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోఆర్డినేటర్ లక్ష్మయ్య మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. విద్యార్థులకు న్యాక్ నుంచి ఇ-మెయిల్ వస్తుందని, తక్షణం స్పందించాలని కోరారు. న్యాక్ గుర్తింపు అంచనాలో భాగంగా యూనివర్శిటీ అందించే సేవలకు విద్యార్థుల నుంచి అభిప్రాయాలు తెలుసుకునేందుకు న్యాక్ ప్రశ్నావళిని ఇ-మెయిల్ ద్వారా పంపుతుందని, ఇందులో 20 ప్రశ్నలకు ఉంటాయన్నారు. విద్యార్థులు తమ ఇ-మెయిల్స్‌ను ప్రతి రోజు చెక్ చేసుకుంటూ ఉండాలన్నారు. ఏవైన సందేహాలు ఉంటే స్థానిక కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

ఎమ్మెల్సీగా వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపిద్దాం



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి గెలుపునకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆ పార్టీ ఎన్నికల బనగానపల్లె నియోజకవర్గ కో ఆర్డినేటర్ శ్రీనివాసులు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం యువత అభ్యున్నతికి పెద్దపీట వేసిందని, ఈ ఎన్నికల్లో రవీంద్రారెడ్డిని గెలిపిస్తే యువత భవిష్యత్తుకు మరింత బలం చేకూరుతుందని పేర్కొన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎన్నికల ప్రచార కమిటీ సభ్యులు కుపేంద్రారెడ్డి, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



భూమిపూజలో పాల్గొన్న ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకులు

బేతంచెర్ల: ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని హెచ్ కొట్టాలలో గ్రామ సర్పంచ్ లక్ష్మిదేవి, ఎంపీటీసీ రత్నమ్మ ఆధ్వర్యంలో 15 లక్షల డీఎంఎఫ్ నిధులతో 1175 మీటర్ల పొలాలకు వెళ్లే రహదారి నిర్మాణానికి మంగళవారం వారు భూమి పూజ చేశారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యను ప్రాధాన్యం మేరకు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని వారు తెలిపా రు. అనంతరం నూతనంగా నిర్మించిన చౌడేశ్వరీ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు నారాయణ, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు మూర్తుజావలీ, మండల నాయకులు బాబుల్ రెడ్డి, ఖాజా, దస్తగిరి, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, గ్రామస్తులు దివాకర్, రవి, వెంకటేశ్వర్లు, రమణ, గురుమూర్తి, రామయ్య, సారధి రంగయ్య పాల్గొన్నారు.

4న తహసీల్దార్ కార్యాలయ భవనం ప్రారంభం



తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ డీఈఈ సునీల్‌రెడ్డి

బనగానపల్లెరూరల్: ఎట్టకేలకు బనగానపల్లె మండలం నూతన తహసీల్దార్ కార్యాలయ భవనం పూర్తయింది. ఈ మేరకు మంగళవారం ఆర్‌అండ్‌బీ డీఈఈ సునీల్‌రెడ్డి భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా ఈ భవనం నత్తనడకను కొనసాగుతుందన్నారు. ఇటీవల ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తీసుకున్న ప్రత్యేక చర్యలతో నిర్మాణ పనులు పూర్తయ్యాయన్నారు. ఫిబ్రవరి 4వ తేదీన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేతుల మీదుగా నూతన భవనాన్ని ప్రారంభిస్తున్నట్లు డీఈఈ సునీల్‌రెడ్డి తెలిపారు.

భక్తులకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 11 నుంచి 21 వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి దేవస్థానం ఈఓ లవన్నను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను మంగళవారం వారు పరిశీలించారు. ఆలయ క్యూలైన్లు పరిశీలించి, ఎంతమంది భక్తులు వేచి ఉంటారు..అని ఈఓను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలయం చేరుకుని ఆలయంలో శివ స్వాములకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూలైన్ సందర్శించారు. అనంతరం పాగాలంకరణ కార్యక్రమం గురించి, వీఐపీల గ్యాలరీ ఏర్పాటు, ప్రొటోకాల్ దర్శన ఏర్పాట్లు, స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవం జరిగే నాగులకట్ట ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఈఓకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల ప్రారంభం వరకు ఏర్పాట్లన్నీ పూర్తి కావాలని ఈఓను ఆదేశించారు. ఈ నెల 8న మరో మారు ఏర్పాట్లుపై సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. శ్రీశైలదేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షుడు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, సభ్యులు మేరాజోత్ హనుమంత్‌నాయక్, మాధవీలత, విజయలక్ష్మి, దేవస్థాన ఏఈఓ ఫణిధర్, ఈఈ రామకృష్ణ, పీఆర్వో టి.శ్రీనివాసరావు, శ్రీశైలప్రభ సంపాదకులు అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.